క్లుప్తంగా

వైఎస్సార్ బీమా తక్షణ సాయం



వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందిస్తున్న సర్పంచ్ రత్నం

ఎస్.రాయవరం : కుటుంబ పెద్ద అకాల మరణం పొందినపుడు వైఎస్సార్ బీమా ఎంతగానో సాయపడుతుందని ధర్మవరం సర్పంచ్ కలిగట్ల రత్నం అన్నారు. ఇటీవల గ్రామంలో అకాల మరణం చెందిన కర్రి కృష్ణ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద ఆదివారం రూ.10 వేలు అందించారు. మిగిలిన నగదు త్వరలోనే నామినీ బ్యాంకు ఖాతాలో జమవు తాయని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ దొరబాబు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ సియ్యాదుల అచ్యుత్, వలంటీర్ దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

మునగపాక : వేసవి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పి.రవికుమార్ కోరారు. మండలంలోని నాగులాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల పాటు విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరంలో రాజుపేట మహిళా పోలీసు జ్యోతిర్మయి నేతృత్వంలో శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



గుడ్డ సంచులను అందిస్తున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

మునగపాక : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాక ఆదర్శ పాఠశాలలో ఆదివారం స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ సమకూర్చిన గుడ్డ సంచులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా, గుడ్డ సంచులను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కేవీ రమణ, దుర్గా ప్రసాద్, హెచ్ఎం సావిత్రి, వార్డు సభ్యులు వేగి కృష్ణ, బొడ్డేడ సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోర్లు ప్రారంభం



కాకరాపల్లిలో బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్ ముసిలినాయుడు

మునగపాక : మండలంలోని కాకరాపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన మంచినీటి బోర్లను సర్పంచ్ కొల్లి ముసిలినాయుడు ఆదివారం ప్రారంభించారు. ఎంపీటీసీ ఇల్లా శిరీషా తన కోటా నిధులు రూ.2 లక్షలతో రెండు చోట్ల బోర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఇల్లా నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పిట్టా పెద మంగారెడ్డి, పెద్దలు కర్రి నాగిరెడ్డి, కొల్లి రాజు, దుర్గారెడ్డి, ఈశ్వరరావు, అప్పారావు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హరిద్వార్‌లో అనకాపల్లి విద్యార్థుల 'శివతాండవం'

అనకాపల్లిటౌన్: ఉత్తరాఖండ్ రాష్ట్రం హరిద్వార్‌లో పుష్కరాల్లో ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో అనకాపల్లి శ్రీ వెంకటసాయి డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ విద్యార్థులు రాణించారు. హరిద్వార్‌లో ఏప్రిల్ 21 నుంచి 30 వరకు జరిగిన నృత్య ప్రదర్శనలో 8 మంది విద్యార్థుల శివతాండవం ఆకట్టుకుంది.

పూడిక తొలగింపుతో 'నేరెళ్ల'కు విముక్తి

- ఒకటిన్నర కిలోమీటర్ల మేర పూడికతీత పనులు
- పంచాయతీ నిధులు రూ.3 లక్షల కేటాయింపు

పాయకరావుపేట: పట్టణ పరిధిలో గల నేరెళ్ల కాలువ పూడిక తొలగింపుతో దీర్ఘకాలంగా పరిష్కారం కాని డ్రైనేజీ సమస్యకు పరిష్కారం లభించింది. తాజాగా రూ.3 లక్షల వ్యయంతో కాలువలో పూడిక తొలగింపు పనులు చేపట్టారు. దీంతో పట్టణవాసులకు మురుగునీటి ఇక్కట్లు తప్పాయి.

పాయకరావుపేట పట్టణంలోని ప్రధాన డ్రైనేజీ వ్యవస్థ నేరెళ్ల కాలువ. ఈ కాలువ ద్వారానే పంట పొలాలకు కూడా నీరు వెళ్లేది. అలాంటి కాలువ ఏళ్ల తరబడి చెత్తాచెదారంతో పూడుకుపోయింది. నీటి పారుదల శాఖ కూడా దీనిపై పెద్దగా పట్టించుకున్న పాపాన పోలేదు. చాలా వరకు కాలువ కుంచించుకుపోయింది. దీంతో డ్రైనేజీ నీరు బయటకు వెళ్లేందుకు వీల్లేని దుస్థితి. చాలా ఏళ్లుగా మెయిన్ రోడ్డే డ్రైనేజీగా మారి, పట్టణవాసులకు ఇబ్బంది కలిగిస్తోంది.

కాలువలో ఏళ్ల తరబడి పూడిక తీయకపోవడంతో, చాలా చోట్ల ఆక్రమణలకు గురైంది. కాలువను ఆనుకుని వ్యవసాయ క్షేత్రాలున్నవారు ముందుకు రావడంతో, ప్రధాన కాలువ కాస్తా కొన్ని చోట్ల మురుగు కాల్వంత కూడా లేకుండా పోయింది. దీనిపై గ్రామ పంచాయతీ పాలకవర్గం దృష్టిసారించింది. పంచాయతీ నిధులతో పూడిక తీతకు శ్రీకారం చుట్టారు. సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల పొడవున కాలువలో పూడిక తొలగింపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు దగ్గరుండి మరీ పనుల్ని పర్యవేక్షిస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి జె.చంద్రశేఖర్ తెలిపారు. పట్టణంలోని ప్రధాన డ్రైనేజీ, నేరెళ్ల కాలువ పూడికతీతతో డ్రైనేజీ సమస్య పరిష్కారమైందని పట్టణవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



నేరెళ్ల కాలువ పూడికతీత తీస్తున్న దృశ్యం



కాలువ ద్వారా గ్రామం నుంచి బయటకు పోతున్న మురుగు నీరు

పార్టీలకతీతంగా సంక్షేమం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కన్నబాబురాజు
- దిబ్బపాలెం అభివృద్ధిపై సమీక్ష

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలో దిబ్బపాలెం-1, దిబ్బపాలెం-2 సచివాలయాల పరిధిలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తు న్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ఎవరికైన సమస్యలు ఉంటే నేరుగా తనను సంప్రదించవచ్చని తెలిపారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా అర్హులైన వారందరికీ, పార్టీలకతీతంగా పథకాలను అందిస్తున్నామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం సచివాలయ పరిధిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంపై సమీక్షించారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు. వలంటీర్లకు వాటర్ ప్రూఫ్ బ్యాగ్‌లను అందించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, ఎంపీపీ కోన బుజ్జి, జెడ్పీటీసీ లాలం రాంబాబు, నర్మాల కుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకరరావు, పిన్నమరాజు వాసు, ఇరువాడ సతీష్, రాజాన విజయ్, నీరుకొండ అశోక్, అడిగర్ల దేముడు, లాలం శ్రీనివాసరావు పాల్గొన్నారు.



దిబ్బపాలెం సచివాలయ పరిధిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

9న మండల సర్వసభ్య సమావేశం

పాయకరావుపేట : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 9న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎ.సాంబశివరావు ఆదివారం తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు మండల పరిషత్ ఆవరణలోని స్త్రీ శక్తి భవన్‌లో సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి మండలంలోని అన్ని విభాగాల అధికారులు హాజరుకావాల్సిందిగా కోరారు.

మంత్రి అమర్‌నాథ్‌ను కలిసిన డీఎస్పీ

అనకాపల్లిటౌన్ : రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను నూతన డీఎస్పీ వి.సుబ్బరాజు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంత్రి స్వగృహానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందించారు. ఇరువురు కాసేపు జిల్లాలో భద్రతాపరమైన అంశాలపై మాట్లాడుకున్నారు.



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎస్పీ

నూకాంబిక దర్శనానికి పోటెత్తిన భక్తజనం



ఆలయం ముందు రహదారిపై క్యూకట్టిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం నూకాంబిక ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ క్యూలైన్లతోపాటు ఆలయ ఆవరణ అంతా భక్తులతో కిట కిటలాడింది. అమ్మవారి నెల పండగ పూర్తయినప్పటికీ ఇంత పెద్దసంఖ్యలో భక్తులు హాజరుకావడంతో ఆలయం కళకళలాడింది. క్యూలైన్లు కిక్కిరిసి, ఆలయ ముందు భాగంలో రహదారిపై అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం ఏర్పడకుండా దేవదాయ శాఖాధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. చిన్నారులకు బాలింతలు పాలిచ్చేందుకు అధికారులు ఆలయ ఆవరణలో ప్రత్యేక గది ఏర్పాటు చేశారు. బాలింతలు, చిన్నారులు కాసేపు సేదతీరారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్, అర్చకులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి



జగనన్నే మా భవిష్యత్తు పేరిట ముద్రించిన చేతి సంచులను ఆవిష్కరిస్తున్న ఎంపీ డాక్టర్ సత్యవతి

- ఎంపీ బీవీ సత్యవతి
- వైద్య శిబిరాలకు విశేష స్పందన
- ఘనంగా ఎంపీ జన్మదిన వేడుకలు

మునగపాక : సేవా కార్యక్రమాల్లో ఉన్న సంతృప్తి మరెక్కడా దొరకదని అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. మండలంలోని ఉమ్మలాడ జంక్షన్ దరి ముఠా కార్మికులు ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. తన జన్మదినం సందర్భంగా జగనన్నే మా భవిష్యత్తు పేరిట ముద్రించిన చేతి సంచుల్ని ఆవిష్కరించి, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాలని అభ్యర్థించారు. అన్ని వర్గాల ప్రజలకు జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మేలు జరుగుతోందన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ దళిత విభాగం మండల అధ్యక్షుడు, ముఠా కార్మిక నాయకుడు మందా రామును ఆమె సత్కరించా రు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ విష్ణుమూర్తి, డాక్టర్ యశ్వంత్, యువజన విభాగం మండల అధ్యక్షుడు మొల్లేటి వినోద్, పార్టీ నేతలు సూరిశెట్టి శ్రీనివాసరావు, కరోతి విజయకుమార్, అల్లవరపు రమణబాబు, కాండ్రేగుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని పలు గ్రామాల్లో అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మునగపాక పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఎంపీ తనయుడు డాక్టర్ యశ్వంత్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షులు కోనపల్లి రామ్మోహనరావు, సచివాలయాల మండల కన్వీనర్ పాలిమేర గణేష్, పార్టీ నేతలు పిల్లి అప్పారావు, బొడ్డేడ మహేష్, బీలా గణేష్, బొడ్డేడ లిల్లీ, ఆడారి కాశీబాబు తదితరులు పాల్గొన్నారు.

➡ వాడ్రాపల్లిలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య నిపుణులు ఎం.హరిప్రసాద్, పెతకంశెట్టి లలిత స్వర్ణ వైద్య పరీక్షలు నిర్వహించారు.234 మంది రోగులకు పరీక్షలు జరిపి, మందులు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నూకరాజు మాట్లాడుతూ మునగపాక మండల అభివృద్ధికి ఎంపీ ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో పెతకంశెట్టి రామజోగినాయుడు, భాస్కరరావు, కన్నుంనాయుడు, మళ్ల జోగారావు, శేషు, కాండ్రేగుల రామారావు తదితరులు పాల్గొన్నారు. కాగా శిబిరానికి 234 మంది రోగులు హాజరుకాగా వారికి ఉచితంగా మందులు అందజేశారు.

➡ గణపర్తిలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. శిబిరాన్ని సర్పంచ్ చదరం గణేష్‌నాయుడు ప్రారంభించారు.



వాడ్రాపల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



మునగపాకలో ఎంపీ జన్మదిన వేడుకల్లో ఎంపీ కుమారుడు డాక్టర్ యశ్వంత్

దైవచింతనతో మానసిక ప్రశాంతత

అనకాపల్లిటౌన్ : దైవచింతన ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. అమ్మవారి ఆలయం వద్ద వాసవీ ట్రస్టు ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్యకాపరమేశ్వరి అమ్మవారి భక్తులకు మజ్జిగ పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. అంతకుముందు రత్నాకర్‌ను ట్రస్టు సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ, వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిలపరశెట్టి బాబీ, ట్రస్టు సభ్యులు బత్తుల గణపతి, బత్తుల వేణుమాధవ్, కడిమిశెట్టి సతీష్, పూసర్ల రాజా, యల్లపు శ్రీనివాస్, కొత్తా గోపీకృష్ణ, అన్నం రాజశేఖర్, తాటికొండ జీవన్ పాల్గొన్నారు.



భక్తులకు పండ్లు, వాటర్ ప్యాకెట్లు, మజ్జిగ అందిస్తున్న రత్నాకర్

వీరబ్రహ్మేంద్రునికి ప్రత్యేక పూజలు



శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : మండల కేంద్రం ఎస్.రాయవరంలో ఆదివారం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లో భక్తులు స్వామి ఆలయానికి చేరుకుని పొలాల్లో పండిన పండ్లను స్వామికి నైవేద్యంగా సమర్పించారు.

ఎముకల వ్యాధులపై అవగాహన

రాంబిల్లి : కీళ్లు, ఎముకల వ్యాధులపై ప్రజలు నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ కీళ్లు, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ టి.సోమేష్ సూచించారు. మామిడివాడ, అప్పన్నపాలెం గ్రామాల్లో రమా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాల్లో పాల్గొన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల చివరి ఆదివారం సేవా దృక్పథంతో గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రమా ఆస్పత్రి మేనేజర్ కనకయ్య, బీసీటీ సామాజిక కార్యకర్తలు శిగిరెడ్డి నాగేశ్వరరావు, గొర్లె దేవుడమ్మ పాల్గొన్నారు.



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ సోమేష్

క్రికెట్ పోటీలు ప్రారంభం

రాంబిల్లి : వాడనర్సాపురంలో ఆదివారం క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. దుర్గాలమ్మ పండగ సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను ఆ పార్టీ మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర ప్రారంభించారు. ఈ పోటీల్లో గెలుపొందిన జట్టుకు రూ.లక్షా 25వేల నగదును బహుమతిగా అందజేయనున్నారు.



పోటీల్లో తలపడనున్న క్రీడాకారులు

ఖాతాదారులకు మెరుగైన సేవలు

అనకాపల్లిటౌన్ : ఎస్‌బీఐ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలని ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ అధ్యక్షుడు ఎస్.కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎల్.చంద్రశేఖర్‌లు అన్నారు. స్థానిక పెంటకోట కన్వెన్షన్ హాల్లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రీజియన్ పరిధిలో 42 బ్రాంచ్‌ల సిబ్బంది ఖాతాదారులకు అనునిత్యం ఉత్తమ సేవలందించడంలో మంచి ఫలితాలు చూపిస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాల నిధిని ఖాతాదారులకు సకాలంలో అందించాలని సూచించారు. బ్యాంకుకు వచ్చే ఖాతాదారులకు బ్యాంకు ఆవరణలో మౌలిక వసతుల ఏర్పాటుకు సిబ్బంది కృషి చేయాలని పేర్కొన్నారు. అంతకుముందు స్థానిక ఎస్‌బీఐ మెయిన్‌బ్రాంచ్ నుంచి ర్యాలీగా సభా స్థలికి చేరుకున్నారు. చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లాలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌ల సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

'మన్‌కీ బాత్'పై అవగాహన

మునగపాక : మండలంలోని మెలిపాక గ్రామంలో ఆదివారం మన్‌కీ బాత్ కార్యక్రమంలో భాగంగా రైతులకు, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మన్‌కీ బాత్ 100వ ఎపిసోడ్ పూర్తయిన సందర్భంగా రాంబిల్లి మండలం హరిపురం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త నాగేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. బీసీటీ సామాజిక కార్యకర్త పి.అప్పలనాయుడు, అభ్యుదయ రైతులు నాగేశ్వరరావు, రమేష్, కృష్ణమూర్తి, మాధవరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవ కమిటీ

అనకాపల్లిటౌన్ : స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఉత్సవ కమిటీ అధ్యక్షునిగా వాకాడ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆలయ ఆవరణలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో కార్యదర్శిగా మద్దాల కూర్మారావు, కోశాధికారిగా వేల్పుల గణేష్, ఉపాధ్యక్షునిగా శీరంశెట్టి నరసింగరావు, సహాయ కార్యదర్శిగా పనస శ్రీకాంత్‌లు ఎన్నికయ్యారు.

బీజేపీ విధానాలతో దేశానికి నష్టం

- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు

అనకాపల్లి రూరల్ : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ విధానాలతో దేశ ప్రగతికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని దొడ్డి రామునాయుడు భవనంలో సీపీఎం, సీపీఐ పార్టీల నేతల సమావేశానికి ఆయన హాజరై బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఆక్షేపించారు. ప్రధాని మోదీ చేపడుతున్న చర్యలతో దేశంలో గత తొమ్మిదేళ్లలో నిత్యావసర వస్తువుల ధరలతో పాటు అన్ని రకాల గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు.కేంద్ర ప్రభుత్వ పాలకుల తీరుపై ఆయన మండిపడ్డారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కారు చౌకగా కట్టబెట్టాలన్న బీజేపీ నిర్ణయాలను సమావేశంలో ప్రసంగించిన పలువురు నేతలు దుయ్యబట్టారు. 32 మంది ప్రాణత్యాగంతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయడానికి కేంద్రం చేస్తున్న అన్ని ప్రయత్నాలనూ సమష్టిగా అడ్డుకోవాలన్నారు. బీజేపీని గద్దె దింపేంతవరకు పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎం.రాము నాయుడు, రాజాన దొరబాబు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గంటా శ్రీరామ్, ఆర్.శంకర్రావు, వీవీ శ్రీనివాసరావు, సీపీఎం సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ, సీపీఐ సీనియర్ నాయకులు వైఎస్ భద్రం, వెంకటేశ్వరరావు, వి.రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నేత వెంకటేశ్వరరావు

బాల సదనంలో ప్రవేశాలకు దరఖాస్తు

కశింకోట : కశింకోటలోని బాల సదనంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సూపరింటిండెంటు శశికళ తెలిపారు. అనాథలు, తల్లిగాని, తండ్రిగాని లేని అనాథలు, పేదలు ప్రవేశానికి అర్హులన్నారు. 33 సీట్లు ఉన్నాయని, ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. వసతి గృహంలో ఉంటూ చదువుకోవాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు సూపరింటెండెంట్, బాల సదనం, కశింకోట చిరునామాలో సంప్రదించి, దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

కశింకోట : మండలంలోని తేగాడ గ్రామంలో దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని అందంగా అలంకరించి ఆలయ అర్చకులు నగిరెడ్డి మంగ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు.



తేగాడలో దుర్గాదేవి అమ్మవారికి పూజలు

3 నుంచి వేసవి శిక్షణ

తుమ్మపాల : వేసవి సెలవులను పురస్కరించుకుని పట్టణంలోని శ్రీగౌరీ గ్రంథాలయంలో మే 3, నెల రోజుల పాటు ఉచిత కంప్యూటర్ శిక్షణ, 4 నుంచి 15 రోజులపాటు చిత్రలేఖనంలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ ఇన్ కంప్యూటర్ కాన్సెప్ట్‌లో ఎంఎస్ ఆఫీస్, పవర్‌పాయింట్, ఇంటర్నెట్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఆసక్తి గలవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాల కోసం 9247187355, 9247166511 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పైడితల్లమ్మ ఆలయానికి విరాళాల సేకరణ

రాంబిల్లి: మామిడివాడ పైడితల్లమ్మ ఆలయ నిర్మాణానికి ఆదివారం విరాళాలు సేకరించారు. చినకలవలాపల్లికి చెందిన కలవలపల్లి గణేష్ రూ.50 వేలు, మామిడివాడకు చెందిన పప్పల నానాజీ రూ.10వేలు విరాళం ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు నెట్టెం సత్యన్నారాయణ, కన్నం రమణారావు, కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీకి శిక్షణ

కోటవురట్ల : ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.కొండబాబు ఆదివారం తెలిపారు. ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్షా ఫలితాలలో ఫెయిల్ అయిన విద్యార్థులకు మరో అవకాశం కల్పిస్తూ ఇంటర్మీడియట్ బోర్డు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్ని నిర్వహిస్తోందన్నారు. ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం మే 1 నుంచి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు.